క్లుప్తంగా

గుడిసె యజమానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని తుంగోడు గ్రామానికి చెందిన చినకొండు శ్రీనివాసులు గుడిసెకు ఇటీవల గుర్తుతెలియని వారు నిప్పుపెట్టగా రూ.50 వేల నష్టం వాటిల్లింది. ఈసందర్భంగా ఆదివారం సర్పంచ్ బొట్లా చిరంజీవి, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, టీయూసీ జిల్లా అధ్యక్షుడు మేకల బాలుయాదవ్‌లు గుడిసె యజమాని శ్రీనివాసులుకు ఆర్థికసాయం కింద రు.10 వేలు అందించారు. పార్టీపరంగా ఆదుకుంటామన్నారు. గోగుల బాలయ్య, పులిమి ఆదినారాయణ పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం

వెలిగండ్ల: అల్లర్లు సృష్టిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించమని ఎస్సై ఎం శివ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులకు ఆదివారం సాయంత్రం పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం శివ మాట్లాడుతూ జూన్ 4 కౌంటింగ్ రోజున ఎటువంటి ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు. బాణసంచా కాల్చరాదన్నారు. ర్యాలీలు, బైక్ స్టైంట్స్ గానీ చేపట్టకూడదన్నారు. ఎటువంటి అల్లర్లు సృష్టించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే బైండోవర్ ఓపెన్ చేస్తామన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

31న మండల సమావేశం

లింగసముద్రం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీన ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యు.శేషుబాబు తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ వద్ద ఉన్న పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



వల్లూరులో ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మతల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సింగరాయకొండ: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి(50) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం సోమరాజుపల్లి రైల్వేగేటు వద్ద జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..మృతుడు బులుగు రంగు టీ షర్టు, నల్ల రంగు లుంగీ ధరించి ఉన్నాడు. ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. వివరాలకు జీఆర్‌పీ సీఐ 9440904870, 9381923900, 7013915467 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు బాలరాజు, కామేశ్వరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ కార్తీక్ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ నెల 28వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు అమ్మవారి ఆలయంలో సామూహిక సుమంగళి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈఓ కార్తీక్ తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు సోమవారం ఆలయ సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

కనులపండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో తాళిచూపుతున్న అర్చకులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేటలో కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా సీతా రామ దేవతామూర్తుల శాంతి కల్యాణోత్సవం ఆదివారం రుత్వికుల వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా అర్చకులు పంచాగ్నుల రామమూర్తి సీతా రామ లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపైకి చేర్చారు. అర్చకులు రామమూర్తి వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గరుత్మంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- 14 టేబుళ్లు, 22 రౌండ్‌లలో ఫలితాలు వెల్లడి
- ఆర్వో నిర్ణయమే తుది నిర్ణయం
- పోలింగ్ ఏజెంట్లు ఎన్నికల నిబంధనావళి పాటించాలి
- ఆర్వో, ఆర్డీఓ పాలపర్తి జాన్‌ఇర్విన్



పాలపర్తి జాన్ ఇర్విన్, ఆర్‌ఓ

కనిగిరి రూరల్: ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాలపర్తి జాన్ ఇర్విన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒంగోలు రైస్ గాంధీ కృష్ణా కాలేజీ రెండో అంతస్తులో కనిగిరి నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 2,40,079 ఓట్లు ఉండగా 297 పోలింగ్ కేంద్రాల్లో 2,04,315 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. జూన్ 4 జరిగే కౌంటింగ్‌లో 14 టేబుళ్లలో, 22 రౌండ్‌లలో లెక్కింపు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్‌లకు రెండు టేబుళ్లు, సర్వీస్ ఓట్లకు రెండు టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. ప్రతి అభ్యర్థికి 14 మంది ఏజెంట్లను వారి అర్హత, పదవులను బట్టి ఎన్నికల నియమావళి ప్రకారం తీసుకున్నామన్నారు. అభ్యర్థి లేదా చీఫ్ ఏజెంట్‌లలో ఒకరు కౌంటింగ్ కేంద్రంలో ఉండవచ్చని తెలిపారు. జూన్ 4న ఉదయం 8గంటలకు కచ్చితంగా కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతందని, అయా అభ్యర్థుల ఏజెంట్లు 6 గంటల లోపే ముందస్తుగా లెక్కింపు కేంద్రానికి వస్తే మంచిదన్నారు. కంట్రోల్ యూనిట్‌లలో ఉన్న ఓట్ల ఓటింగ్ నంబర్‌నే తుది నెంబర్‌గా పరిగణంలో తీసుకుని కౌంటింగ్ చేస్తామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత చివరిగా ర్యాండమ్‌గా 5 వీవీ ప్యాడ్‌లను, కంట్రోల్ యూనిట్‌లను క్రాస్ చెక్ చేస్తామన్నారు. ప్రతి ఏజెంట్‌కు ప్రత్యేకంగా కౌంటింగ్ ఐడీ కార్డ్ ఇస్తామని చెప్పారు. కౌంటింగ్ హాల్‌లోకి వచ్చిన తర్వాత బయటకు వెళ్లి వచ్చే అవకాశం ఉండదన్నారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్ల అనుమతి లేదన్నారు. లెక్కింపు కేంద్రానికి కిలోమీటర్ దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బాణాసంచా కాల్చడం, విక్రయాలు చేయడం నిషేదమన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో, కేంద్రంలో ఆర్వో నిర్ణయమే తుది నిర్ణయంగా ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని ఆర్వో హెచ్చరించారు. ఈ మేరకు త్వరలో కనిగిరిలో కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, గోపూజ



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. వేకువజామున నారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్లు, వస్తువులు అందజేస్తున్న సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ కొండయ్య

కనిగిరి రూరల్: ఆర్టీసీ బస్సుల్లో పోగొట్టుకున్న సుమారు రూ. లక్ష విలువైన రెండు సెల్‌ఫోన్లను ప్రయాణికుడికి అందజేశారు. వివరాల్లోకి వెళితే.. కనిగిరి డిపోకు చెందిన బస్సులో పీసీపల్లి మండలం గుదేవారిపాలెంకు చెందిన శ్రీనివాసరావు గుంటూరు నుంచి కనిగిరికి ప్రయాణించాడు. ఈ క్రమంలో బస్సులో సెల్‌ఫోన్లు మరిచిపోయి కనిగిరిలో దిగాడు. కొంత అనారోగ్యంతో ఉన్న అతను ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న తర్వాత తన రెండు ఫోన్లు బస్సులో మరిచిపోయినట్లు గుర్తించాడు. వెంటనే మరో వ్యక్తి ఫోన్‌తో.. తన నంబర్‌కు కాల్ చేయడంతో బస్సులో ఫోన్ రింగ్ అయ్యింది. దాన్ని గమనించిన పార్కింగ్ డ్రైవర్ ఆ ఫోన్‌ను తీసుకెళ్లి సెక్యూరిటీ పాయింట్‌లో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ కొండయ్యకు అందజేశాడు. ఆ తర్వాత ప్రయాణికుడు శ్రీనివాసరావుతో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య మాట్లాడి.. సీట్ల మధ్యలో పడిపోయి ఉన్న మరో ఫోన్‌ను, కళ్ల జోళ్లను తీసుకుని భద్రపరిచారు. అనంతరం ప్రయాణికుడి తండ్రి వెంకటేశ్వర్లు డిపో వద్దకు వచ్చి వివరాలు తెలిపి సుమారు ఫోన్లు, ఇతర వస్తువులు తీసుకున్నాడు. శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్‌కు, హెడ్ కానిస్టేబుల్, ఆర్టీసీ సిబ్బందికి ధన్యవాదములు తెలిపారు. మెకానిక్ ఎస్‌కే నజీర్ బాషా, పార్కింగ్ డ్రైవర్ తదితరులున్నారు.

‘అపూర్వ’ కలయిక



నాటి ఉపాధ్యాయులతో సీఎస్‌పురం జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

- నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు



నాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల కలయిక కార్యక్రమం విద్యార్థుల తీపిజ్ఞాపకాల నడుమ సాగింది. 1997–2002 విద్యాసంవత్సరాల్లో 6 నుంచి 10వ తరగతి పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగింది. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి మొత్తం 71 మంది విద్యార్థులు హాజరు కాగా నాటి సంగతులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. కార్యక్రమానికి నాటి ఉపాధ్యాయులు జొన్నలగడ్డ గోవిందయ్య, హరిబాబు, చంద్రమౌళి, రామాంజనేయ శర్మ, చిన్న, సునీత పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక మధురానుభూతిని మిగిల్చిందన్నారు. గడిచిన కాలం ఎంతో మానవత్వంతో కూడిందని, నేడు సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏళ్ల తరువాత ఈ కలయిక తమజీవితంలో మరువలేనిదన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అవయవదానంతో అభాగ్యులకు ప్రాణదానం



ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కందుకూరు: అవయవదానంతో ఎందరో అభాగ్యులకు పునర్జన్మ ప్రసాదించినట్టేనని, అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ధమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపాసక గాండ్ల హరిప్రసాద్ అన్నారు. బుద్ధ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో ధమ్మ చక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మా నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ గౌతమబుద్ధుని ప్రబోధాలతో ఏర్పాటైన ఈ సంఘం సేవా కార్యక్రమాలను కందుకూరు ప్రాంతంలో కూడా విస్తరించాలనే ఉద్దేశంతో కృషి చేస్తున్నామన్నారు. అవయవదానంపై సమాజంలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. మరణాంతరం అవయవదానానికి ముందుకు వచ్చే వారి సంఖ్య పెంచేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు పి. మాలకొండయ్య, బూసి సురేష్, ఎం బాలకోటయ్య, బాలబ్రహ్మం, గనివినేని శ్రీనివాసరావు, ఇనకొల్లు మస్తానయ్య, చనమాల కోటేశ్వరరావు, ముతకని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనలో మరొకరు మృతి

- మొన్న భార్య, నేడు భర్త
- ఒంటరైన మాతృ హృదయం
- కనిగిరి పాతూరు ఎస్సీ కాలనీలో విషాదఛాయలు



మన్నేపల్లి టెండూల్కర్(ఫైల్)

కనిగిరి రూరల్: ఇటీవల వేటపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మరొకరు ఆదివారం మృతి చెందారు. ఈనెల 23న గురువారం బాపట్ల నుంచి కారులో తిరిగి కనిగిరికి తిరిగి వస్తుండగా వేటపాలెం వద్ద రెండు కార్లు ఢీ కొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ఉన్న కనిగిరి పాతూరు ఎస్సీ కాలనీకి చెందిన మన్నెపల్లి గ్లోరి(27) అక్కడికక్కడే చనిపోగా, తీవ్ర గాయాల పాలై గత నాల్గు రోజులగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త మన్నెపల్లి టెండుల్కర్ (29) ఆదివారం మృతి చెందాడు. ఆదివారం ఆయన మృతదేహాన్ని కనిగిరి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు.

ఒంటరై.. తల్లడిల్లుతున్న మాతృహృదయం

కమలాకర్, ఎలిజబెత్ దంపతులకు మన్నేపల్లి టెండుల్కర్ ఒక్కడే సంతానం. విశ్రాంత ఉద్యోగి అయిన తండ్రి కమలాకర్ ఏడాది క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. టెండుల్కర్‌కు బాపట్లకు చెందిన గ్లోరితో మూడేళ్ల క్రితమే వివాహమైంది. ఎంతో ఆనందంగా సాగుతున్న కుటుంబంబాన్ని మృత్యువు కబళించి చిన్నాభిన్నం చేసింది. ఏడాది క్రితం భర్త చనిపోగా, నాల్గు రోజుల వ్యవధిలో కుమారుడు, కోడలు మరణించడంతో... వృద్ధురాలైన తల్లి ఎలిజబెత్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టిస్తోంది.

శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా అనేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని బొగ్గుల గొంది కాలనీలో ఆదివారం చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, మురికినీటి కాలువలు, నీరు, విద్యుత్ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ దశలవారీగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నీరు, విద్యుత్ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి అరుణోధర్, నాగమణి, కోటేశ్వరమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు ఆర్థికసాయం



క్షతగాత్రురాలు సలోమికి నగదు అందజేస్తున్న రాయళ్ల మాలకొండయ్య

వెలిగండ్ల: కనిగిరి–చెన్నై ఆర్టీసీ బస్సు నెల్లూరు సమీపంలో దామరమడుగు వద్ద ప్రమాదానికి గురైన సంఘటన పాఠకులకు తెలిసిందే. ఆ బస్సులో ప్రయాణిస్తున్న వెలిగండ్ల మండలం మరపగుంట్ల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త గొర్రెముచ్చు సలోమి, ఆమె భర్త తీవ్ర గాయాలకు లోనయ్యారు. క్షతగాత్రులకు రెండు కాళ్లు, చేతులు విరగగా నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులు రాయళ్ల మాలకొండయ్య ఆదివారం నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సలోమి, ఆమె భర్తను పరామర్శించి రూ.18 వేలు ఆర్థికసాయం అందజేశారు. క్షతగాత్రులు ఇద్దరూ త్వరగా కోలుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తరపున రాయళ్ల మాలకొండయ్య కోరారు.

విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యం



బహుమతులు సాధించిన విద్యార్థులు



శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులు



టంగుటూరు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఉలవపాడు: విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. వేసవి శిక్షణ తరగతులను పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి పెద్దవారిని గౌరవిస్తూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రమశిక్షణగా ఉంటే మంచిస్థాయికి ఎదుగుతారని సూచించారు. గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదవాలన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న విజ్ఞాన సంపదను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ పుస్తకపఠనంతో ఎంతో విజ్ఞానం అలవడుతుందన్నారు. ముందుగా విద్యార్థులకు డిక్టేషన్ నిర్వహించారు. అనంతరం గత పదిరోజులుగా జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. మొత్తం 44 మంది విద్యార్థులకు 150 బహుమతులు అందచేశారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపి(సింగరాయకొండ): వేసవిలో విద్యార్థులకు మేధస్సు, నైపుణ్యాన్ని పెంచేందుకు నీతి కథలు, ఆటపాటలతో ప్రోత్సహిస్తున్నట్లు గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు తెలిపారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు పోటీలు నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు శ్రీధర్ విద్యార్థులకు గణితంలో మెళకువలు నేర్పించారు. శిక్షణ తరగతులకు 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు తినుబండారాలు పంపిణీ చేశారు.

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వహకుడు గుమ్మడి వర్ధనరాజు తెలిపారు. ఆదివారం విద్యార్థులకు కథలు, మంచి పుస్తకాలు చదివించి, డ్రాయింగ్ నేర్పించారు.

కందుకూరులో కార్డన్ సెర్చ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

కందుకూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో శాంతి, భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. పట్టణంలోని ఎస్సై ఆనందభాస్కర్ నేతృత్వంలో ఆదివారం కార్డన్ సెర్చ్ తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతంలో ఇంటింటి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, చోరీ సొత్తు, సరైన పత్రాలు లేకుండా ఉంచిన వస్తువులు, వాహనాలను స్వాధీనం చేసుకోవడం, పాత నేరస్తులపై నిఘా ఉంచడం వంటి కార్యక్రమాల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనవసర ఆవేశాలకు పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని, చట్టాన్ని ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.